భజే వాయుపుత్రం

ఘనంగా హనుమజ్జయంతి

జిల్లా వ్యాప్తంగా హనుమజ్జయంతి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారి మూల విరాట్‌లకు అభిషేకాలు చేశారు. తమలపాకులు, అప్పాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి.. ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయాల వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు. పారాయణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, గ్రామోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ కనిపించింది.


పూజలు అందుకున్న ద్వారం ఆంజనేయస్వామి

కదిరి:
పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన ద్వారం ఆంజనేయస్వామి ఆలయం, తేరువద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి మూల విరాట్‌లకు అభిషేకాలు, తమలపాకులు, అప్పాలు, ప్రత్యేక పుష్పాలతోపాటు ప్రత్యేక పూలు చేశారు.


ప్రత్యేక అలంకరణలో తవళం ఆంజనేయస్వామి


ఉత్సవ విగ్రహం ఊరేగింపు

నల్లచెరువు, జూన్ 1: ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉద యం 5గంటలనుంచి అభిషేకాలతో ప్రారంభమై, మధ్యాహ్నం కోర్కెల నివారణతో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టు ప్రదక్షణ నిర్వహించారు.

తనకల్లు:
మండలంలోని తవళం గ్రామ సమీపంలో పాపాఘ్ని పరివాహక ప్రాంతంలో స్వయభుగా వెలసిన తవళం ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాజ్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మండ్లిపల్లి, మల్లిరెడ్డి పల్లి, పెద్దపల్లి, తనకల్లు తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణంలో పాలపాటి దిన్నె ఆంజేయస్వామి

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



కదిరి, జూన్ 1: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. సెలవులతోపాటు శనివారం, హనుమజ్జయంతి కావడంతో భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. తెల్లవారు జామునుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి


సిబ్బంది ఆన్‌లైన్ నియామకాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

పుట్టపర్తి, జూన్ 1:
సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధుల్లో పాల్గొనే సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాలు కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ విభాగంలో శనివారం ఎన్నికల కౌంటింగ్ రెండో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు విధులకు కేటాయించిన ఉద్యోగులు శిక్షణకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి ఎవరు ఏ టేబుల్‌కౌంటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుందో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్ స్నేహల్‌వినాయక్ గొల్టేకర్, డీఆర్వో కొండయ్య, పుట్టపర్తి, ధర్మవరం ఆర్వోలు భాగ్యరేఖ, వెంకట శివరామిరెడ్డి, ఐటీ నోడల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, డీటీ నవీన్‌కుమార్, నెట్‌వర్క్ ఇంజనీర్ విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

తట్టుకోలేని టెన్షన్



- ఎల్లుండి ఎన్నికల ఫలితాలు
- వైసీపీ, కూటమి అభ్యర్థులలో తీవ్ర ఉత్కంఠ
- కూటమిదే విజయం అంటున్న మెజార్టీ ఎగ్జిట్ పోల్స్

పుట్టపర్తి, జూన్1 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌన్‌డౌన్ మొదలైంది. ఎన్నికల్లో పోటీపడిన అభ్యర్థుల భవితవ్యం మంగళ వారం తేలనుంది. శనివారం సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌లో అత్యధిక సంస్థలు టీడీపీ కూటమిదే అధికారం అని వెల్లడించడంతో జిల్లాలో గెలిచే స్థానాలు, మెజార్టీలపై మరింత ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కూటమి, వైసీపీ మధ్య నువ్వానేనా అన్న విధంగా పోటీ సాగింది. ఇప్పటికే ఆయా నియోజక వర్గాల్లో పోలింగ్ సరళిని లెక్కలేసుకున్న టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థులు గెలుపు తమదే అన్న ధీమాతో ఉన్నారు. కౌంటింగ్‌కు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

కూటమిలో ఉత్సాహం

రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని, అత్యధిక స్థానాలు టీడీపీ కూటమి గెలుస్తుందని మెజార్టీ ఎగ్జిట్‌పోల్ సర్వే సంస్థలు ఇవ్వడంతో టీడీపీ జనసేన, బీజేపీలో ఉత్సాహం వచ్చింది. జిల్లాలో హిందూపురం పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం నుంచి బాలకృష్ణ హ్యాట్రిక్ కొట్టబోతున్నట్లు స్పష్టమైంది. జిల్లాలో 84.70 శాతం పోలింగ్ నమోదు కావడం అధికార వైసీపీకి కలిసివచ్చిందా టీడీపీ కూటమికి కలిసివచ్చిందా అన్న చర్చ జిల్లాలో నడుస్తోంది. కూటమి అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్ బాగా కలిసివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ సైతం వైసీపీకి నిరాశను మిగిల్చాయి. ఇక జిల్లాలో గెలుపు, మెజార్టీపై భారీగా బెట్టింగ్ నడుస్తోంది. ఏఏ పార్టీ అభ్యర్థులు గెలుస్తారు? మెజార్టీ? రాష్ట్రం, కేంద్రంలో ఏపార్టీ అధికారంలోకి వస్తుంది వంటి అంశాలతో కోట్లలో బెట్టింగ్ జరిగింది. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్ పోల్స్‌తో బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్ మరింత ఎక్కువైంది. ఈఉత్కంఠకు మంగళవారం తెర పడనుంది.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	38.0 25.0	38.0 26.0	38.0 26.0	32.0 24.0	37.0 24.0

మొబైల్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం


మొబైల్ హాస్పిటల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న చక్రవర్తి

పుట్టపర్తి, జూన్ 1: కర్ణాటక రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో డెంటల్ వైద్యసేవల కోసం శ్రీసత్యసాయి మొబైల్ హాస్పిటల్ పేరిట అంబులెన్స్‌ను ప్రారంభించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ సభామండపంలో శనివారం రాత్రి మొబైల్ హాస్పిటల్‌ను సత్యసాయి గ్లోబల్‌ట్రస్టు చైర్మన్ చక్రవర్తి, సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. ఉత్తర కర్ణాటక జిల్లాల్లోని గ్రామీణప్రాంతాల్లో మెరుగైన డెంటల్ వైద్యసేవల కోసం ఈ మొబైల్ హాస్పిటల్‌ను వినియోగిస్తారు. ఈ అంబులెన్స్‌లో ఎక్స్‌రేతో పాటు ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి.

మొబైల్ ఆస్పత్రి వాహనం ఇదే..


అలరించిన భక్తిగీతాలు


పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి, జూన్ 1: తమిళనాడు భక్తులు తమ సంగీత గానంతో సత్యసాయి భక్తులను అలరింపచేశారు. సాయికుల్వంతు మందిరంలో శనివారం సాయంత్రం తిరువళ్లూరు భక్తులు సాయిసమర్పణం పేరిట సంగీత గాన కచేరిని చేపట్టారు. మధుర గానంతో భక్తులను మైమరపింపచేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


మృతుడు రఫిక్ (ఫైల్)


పెనుకొండ టౌన్(సోమందేపల్లి), జూన్ 1: ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికుడు షేక్ రఫిక్(40) ఇంట్లో ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన భార్య యాస్మిన్, కొడుకు, కుమార్తె, తండ్రి ఫక్రుద్దీన్, తల్లి జరీన్‌తాజ్‌లతో కలిసి సోమందేపల్లి ఇందిరానగర్‌లో నివాసముంటున్నారు. ఇంట్లోనే మగ్గం వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు అధికం కావడంతో పాటు చీరలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మగ్గం గుంత వద్దకు వెళ్లి అక్కడే ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు ఎక్కడికి వెళ్లాడని అతడి గురించి వెతకగా మగ్గం గుంతలో ఉరి వేసుకున్నట్లు గమనించారు. ఉరి తప్పించి బయటకు తీసుకువచ్చి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాయదారి మట్కా!

- పురంలో చాపకింద నీరులా..
- రోజుకు రూ.20లక్షలకు పైగా ఆట
- కూలీలే టార్గెట్‌గా ఏజెంట్లు
- చితికి పోతున్న పేదల బతుకులు



హిందూపురం, జూన్ 1: పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా హిందూపురంలో మట్కా చాపకింద నీరులా విస్తరిస్తోంది. మట్కా మహమ్మారి పేదల బతుకులను ఛిద్రం చేస్తోంది. ఒకప్పుడు పట్టీల రూపంలో సాగిన ఈ జూదం సాంకేతికత పెరగడంతో సెల్‌ఫోన్లలోనే దందా సాగిస్తున్నారు. పట్టణంతోపాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం జోరుగా సాగుతోంది. ఏజెంట్ల మాయలో పడి సామాన్య కూలీలు బతుకు బుగ్గి చేసుకుంటున్నారు. హిందూపురంలో రోజుకు రూ.20లక్షలకు పైగా మట్కా ఆడుతున్నట్లు సమాచారం. దీనికి తోడు అధికార పార్టీ అండ ఉండటంతో మూడు క్లోజులు, ఆరు ఓపెన్లుగా సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి.



గ్రామాలకూ పాకిన మహమ్మారి

గతంలో హిందూపురం లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో మాత్రమే సాగిన ఆట గ్రామాలకూ పాకింది. ఈ ఆటలో మధ్యవర్తులదే కీలకపాత్ర. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వీరు మట్కా పట్టీలు ముందు వేసుకుని కుస్తీ పడుతూ జూదరులకు సలహాలు ఇస్తుంటారు. ఇలాంటి వారు హిందూపురం పట్టణంలో 20మందికి పైగా ఉన్నారు.

రోజుకు రూ.20 లక్షలకు పైగా ఆట

హిందూపురం నియోజకవర్గంలో రోజుకు రూ.20లక్షలకు పైగా మట్కా సాగుతున్నట్లు సమాచారం. ఒక్కో ఏజెంట్‌కు రోజుకు కనీసం రూ.3వేల నుంచి రూ.5వేల దాకా మిగులుతుంది. మరికొందరైతే రూ.10వేలదాకా కమీషన్ కొట్టేస్తుంటారు. ఓపెన్, క్లోజ్, బ్రాకెట్‌తోపాటు మట్కాల నేర్పర్లు పాన్‌నంబరు పేరుతో ఆట సాగుతోంది. ఒకప్పుడు ఆరిండ్ల ఆట ఉండేది. నేడు ఏడిండ్ల ఆట ప్రారంభమయ్యింది. దీంతో వారమంతా మట్కా నిర్విఘ్నంగా సాగుతోంది. హిందూపురంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది ఈ ఆటను యథేచ్ఛగా సాగిస్తున్నారు. వారికి పోలీసుల అండ కూడా ఉందని సమాచారం

కూలీలే టార్గెట్‌గా ఏజెంట్లు

మట్కాకు బానిసైన పేద, మధ్యతరగతి ప్రజలు దగా పడుతున్నారు. బీటర్లు, నిర్వాహకులు ధనవంతులవుతున్నారు. హిందూపురంలో కొంతమంది నిర్వాహకులు కోట్లకు పడగలెత్తారు. బీటర్లయితే లక్షల్లో వెనకేసుకొంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చనే అత్యాశతో ఈ ఆటలో దిగుతారు. కానీ ఇందులో డబ్బు సంపాదించిన వారు వేలల్లో ఒక్కరు కూడా ఉండరు. రూపాయికి రూ.70నుంచి 80 వస్తుందని అత్యాశతో మట్కావైపు ఒక్కసారి తొంగిచూస్తే ఈ మహమ్మారి భారి నుంచి తప్పించుకోవడం అంత ఈజీకాదు. ఈ ఆటలోకి దిగడమేకాని అందులో జయించి బయటికి వచ్చిన వ్యక్తులు చాలా అరుదు.

ఎన్నికల విధుల్లో పోలీసులు



రెండు నెలలుగా పోలీసులు సార్వత్రిక ఎన్నికలపై దృష్టిసారించారు. దీంతో వారు అధిక సమయం ఎన్నికలపైనే దృష్టిపెట్టారు. దీనికి తోడు హిందూపురం, లేపాక్షి మండలాల్లో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేయడం, జిల్లాలోని ఇతర పోలీసులకంటే హిందూపురం నియోజకవర్గంలో ఉన్న పోలీసులకే పని ఒత్తిడి అధికమని చెప్పవచ్చు. ఇదే అదునుగా భావించిన మట్కాబీటర్లు, నిర్వాహకులు తమ చేతివాటం చూపిస్తున్నారు. అయితే పోలీస్‌శాఖలో కిందిస్థాయి సిబ్బంది వీరికి పుష్కలంగా సహకరిస్తున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా మట్కా జోరుగా సాగుతుందని పోలీసులు ప్రశ్నిస్తే గతంలోలా కాదు ప్రస్తుతం అధిక శాతం మట్కా ఆడేవారు ఫోన్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నారని అడ్డుకోవడం అంత సులభం కాదని చెప్తున్నారు. ఏది ఏమైనా హిందూపురంలో మట్కా వ్యాపారం వల్ల చిన్నా, చితక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని ఎంతోమంది ఈ మట్కా మహమ్మారికి చిక్కి ఆర్థికంగా మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీని నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

దృష్టి సారించాం : కంజక్షన్, డీఎస్పీ



నియోజకవర్గంలో మట్కా, మహమ్మారిని అణిచి వేసేందుకు దృష్టి సారించాం. ఒకవైపు ఎన్నికల విధులున్నా మట్కా, పేకాటపై దృష్టిపెట్టాలని ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశించాం. పట్టుబడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. మట్కా బీటర్లకు పోలీస్ సిబ్బంది ఎవరైనా సహకరిస్తున్నారని తెలిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు.

బాడుగ కోసం ఆందోళన

ఎన్నికల్లో వాహనాలు వాడుకుని డబ్బులు ఇవ్వరా?


ఆందోళన చేస్తున్న వాహనదారులు

మడకశిర టౌన్, జూన్ 1: ఎన్నికల సమయంలో తీసుకొన్న వాహనాలకు బాడుగ డబ్బులు చెల్లించాలని ఆయా వాహనాల యజమానులు, డ్రైవర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. ఇతర నియోజకవర్గాల్లో సంబంధిత ఎన్నికల అధికారులు బాడుగ డబ్బులు చెల్లించారని, మడకశిరలో మాత్రం పోలింగ్ ముగిసినప్పటి నుంచి బాడుగ డబ్బుల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు అడిగితే స్టేషన్‌లో పెట్టిస్తామని ఓ అధికారి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 25 వాహనాలకు సంబంధించి బాడుగ డబ్బులు చెల్లించాల్సి ఉందని, దాదాపు ఒక్కో వాహనానికి రూ.29600లకు పైగా బాడుగ డబ్బులు ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు రూ.10వేలు ఇస్తామని సంతకం చేసి తీసుకెళ్లాలని అధికారులు అంటున్నారని, ఇది సమంజసమా అని ప్రశ్నించారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం ఆరో తేదీ అయినా తమ డబ్బులు పూర్తిగా చెల్లించాలని అడుగుతున్నా అధికారుల నుంచి స్పందన రాకపోవడంతోనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఆర్‌ఓ, తహసీల్దార్ బయటకు వెళ్లారని, వారు వచ్చినవెంటనే సమస్య పరిష్కరిస్తామని అధికారులు తెలపడంతో వారు శాంతించారు.

కూటమికే జై

- మెజార్టీ ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడి
- వైసీపీ అభ్యర్థుల్లో అలజడి
- బెట్టింగ్ రాయుళ్లలోనూ నైరాశ్యం
- టీడీపీలో జోష్...
- జిల్లాలోని మెజార్టీ అసెంబ్లీ స్థానాలు కూటమికే



అనంతపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ ఎలా ఉంటాయనే ఆతృత అందరిలోనూ కనిపించింది. ఎగ్జిట్‌పోల్స్ ఎప్పుడు విడుదల చేస్తారా అని రాజకీయ పార్టీల నేతలే కాకుండా... ఆయా పార్టీల తరుపున ఎన్నికల పోటీలో నిలిచిన అభ్యర్థులు మొదలుకొని పార్టీల శ్రేణులు, మద్దతు దారులు చివరికి బెట్టింగ్‌రాయుళ్ల ఎదురు తెన్నులకు ఎట్టకేలకు తెరపడింది. ఎగ్జిట్ పోల్స్ కోసం నరాలు తెగే ఉత్కంఠతో ఎదురుచూసిన వారందరికి ఉపశమనం కలిగించేలా శనివారం సాయంత్రం 6.30 గంటలకు సర్వే సంస్థలు ఒక్కొక్కరుగా ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించాయి. మెజార్టీ సర్వేల ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూటమివైపే మొగ్గు చూపా యి. కేవలం నాలుగైదు సర్వే సంస్థలు మాత్రమే అధికార వైసీపీకి మెజార్టీ స్థానాలిచ్చారు. ఇక మిగిలిన సర్వే సంస్థలన్నీ రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టబోతోందని తేల్చి చెప్పాయి. రైజ్ పొలిటికల్ రీసెర్చ్, పీపుల్స్ పల్స్, చాణిక్య స్ట్రాటజీస్, పీటీఎస్, పయనీర్‌పోల్ స్ట్రాటజీస్, ప్రిజమ్, ఎస్టీటీ, ఏపీ కనెక్ట్, నేషనల్ ఫ్యామిలీ, రింగ్ టు పోల్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సర్వే సంస్థలు కూటమికే పట్టం కట్టడం గమనార్హం. ఇదిలా ఉండగా... రాష్ట్రంలో మెజార్టీ ఓటర్లు కూటమి అభ్యర్థులను గెలిపించడానికి ప్రధాన కారణాలను ఎగ్జిట్‌పోల్స్‌లో స్పష్టం చేయడం గమనార్హం. వైసీపీ ఐదేళ్ల విధ్వంసకర పాలన, వేధింపులు, అరాచకం ఒక కారణమైతే... నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకపోవడమూ మరో కారణంగా ఆ సర్వే సంస్థలు చెప్తున్నాయి. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని అవమాన పరిచారనే ఆవేదన ప్రజల్లో ఉండటం, భావితరాల భవిష్యత్తు కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం వ్యవసాయం, నీటిపారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించిన నేపథ్యంలోనే... పట్టణ ప్రాంత ఓటర్లేకాదు... గ్రామీణ ప్రాంత ఓటర్లలోనూ మార్పునకు బీజం పడిందనే అభిప్రాయాన్ని మెజార్టీ సర్వే సంస్థలు స్పష్టం చేశాయి. గత ఎన్నికల్లో మాదిరిగా... వైసీపీకి ఒక్క చాన్స్ ట్రాప్‌లో ప్రజలు పడలేదనే విషయాన్ని స్పష్టంగా సర్వే సంస్థలు వెల్లడించాయి. ప్రధానంగా ఈ ఎన్నికలు జగన్, యాంటీ జగన్, చంద్రబాబు వర్సెస్ జగన్ అన్న రీతిలో జరిగాయనంటున్నారు. ఏది ఏమైనప్పటికీ మెజార్టీ సర్వేల ఎగ్జిట్‌పోల్స్ అన్ని కూటమిదే అధికారమని స్పష్టం చేస్తున్న నేపథ్యంలో... కూటమి పార్టీల నేతలు, ఆ పార్టీల శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

వైసీపీలో అలజడి...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐప్యాక్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో దేశం షాక్‌కు గురయ్యేలా ఫలితాలుంటాయని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో కంటే ఎక్కువ సీట్లు సాధించి మరోమారు అధికారంలోకి రాబోతున్నామని చెప్పారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థుల్లోనూ, శ్రేణుల్లోనూ ఉత్సాహం నెలకొంది. ఇదే క్రమంలో 9న విశాఖపట్నంలో ప్రమాణస్వీకారం చేస్తారని ఆ పార్టీ పెద్దలు కొందరు మీడియాతో వెల్లడించిన విషయం తెలిసిందే. కాగా... పోలింగ్ సరళిని చూసిన తరువాత వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి భయం పట్టుకుంది. ఈ నేపథ్యంలో... సీఎం ఆ అభద్రతాభావాన్ని తొలగించేలా వ్యాఖ్యలు చేయడంతో కొంత ఊరట చెందారు. అయితే ఎగ్జిట్‌పోల్స్ ఎలా ఉంటాయోనన్న భయం మాత్రం ఆ పార్టీ అభ్యర్థులు, శ్రేణులను వీడలేదు. ఎగ్జిట్‌పోల్స్ విడుదల కావడం, మెజార్టీ సర్వే సంస్థలన్నీ కూటమికే మొగ్గు చూపడం వైసీపీలో అలజడి రాజేసిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కౌంటింగ్‌కు రెండ్రోజులు గడువున్న నేపథ్యంలో... ఎగ్జిట్‌పోల్స్ కూటమివైపే మొగ్గు చూపడం ఆ పార్టీ అభ్యర్థులు, శ్రేణులను ఉక్కిరిబిక్కిరి చేస్తోందన్న భావన ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతుండటం గమనార్హం.

బెట్టింగ్ రాయుళ్లల్లోనూ నైరాశ్యం

వైసీపీ అధికారంలోకి వస్తుందని కొందరు, ఫలానా అభ్యర్థి గెలుస్తాడని మరికొందరు బెట్టింగ్‌రాయుళ్లు వైసీపీ పక్షాన పందెం కాసిన విషయం తెలిసిందే. కూటమిదే అధికారమని టీడీపీ పక్షాన పందెం కాసేందుకు ఎక్కువ మంది పోటీపడ్డారు. రూ. లక్షకు రూ. 1.50 లక్షలు ఇచ్చేందుకు వెనుకంజ వేయలేదు. ఈ క్రమంలో రెట్టింపు పందెం ఇస్తున్న నేపథ్యంలో... కొందరు బెట్టింగ్‌రాయుళ్లు అధికార వైసీపీ పక్షాన పందెం కాశారు. జిల్లాలో గత ఎన్నికలతో పోలిస్తే... భారీగా బెట్టింగ్ తగ్గినప్పటికీ... కొందరు మాత్రం పందెం కాసేందుకు ఉత్సాహం చూపారు. ఆయా నియోజకవర్గాల్లో పందెంరాయుళ్ల నుంచి అందిన సమాచారం మేరకు... ఒక్కో నియోజకవర్గంలో తక్కువలో తక్కువన్నా... రూ. 5 కోట్ల వరకూ పందేలు జరిగాయి. కాగా... ఎగ్జిట్‌పోల్స్‌లో మెజార్టీ సర్వే సంస్థలన్నీ కూటమిదే అధికారమని వెల్లడిస్తున్న నేపథ్యంలో... అధికార వైసీపీ పక్షాన పందెంకాసిన పందెంరాయుళ్లల్లోనూ నైరాశ్యం నెలకొంది. ఎగ్జిట్‌పోల్స్‌తో ఆశలు ఆవిరయ్యాయనే అభిప్రాయం బెట్టింగ్‌రాయుళ్ల నుంచే వ్యక్తమవుతుండటం గమనార్హం.

మెజార్టీ అసెంబ్లీ స్థానాలు కూటమికే...

జిల్లాలో 8 నియోజకవర్గాలున్నాయి. అనంతపురం పార్లమెంటు పరిధిలో అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లా యూనిట్‌గా తీసుకున్న నేపథ్యంలో హిందూపురం పార్లమెంటు పరిధిలోని రాప్తాడు నియోజకవర్గం జిల్లా పరిధిలోకే రానుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో మెజార్టీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించబోతున్నారని ఎగ్జిట్‌పోల్స్‌లో మెజార్టీ సర్వే సంస్థలు వెల్లడించాయి. ఒక సర్వే సంస్థ అయితే ఏకంగా 8 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే గెలవబోతున్నారని ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడించింది. ఉమ్మడి అనంత జిల్లాలో 14 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపొందుతారని ఆ సర్వే సంస్థ స్పష్టం చేయడం కూటమి అభ్యర్థులతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ మరింత ఉత్సాహాన్ని నింపుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎగ్జిట్‌పోల్స్ ఎగ్జాట్ పోల్స్‌గా మారనున్నాయా..? లేదా అనేది తేలాలంటే మరో 48 గంటలు వేచి చూడాల్సిందే...



బెళుగుప్ప మండలం గంగవరంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు (ఫైల్)

పీఆర్‌లో బిల్లుల గండం..!

- రూ.60.62 కోట్ల వరకు పెండింగ్
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన నిర్మాణాలు
- అయోమయంలో కాంట్రాక్టర్లు

పెండింగ్ బిల్లుల వివరాలు

పనులు	పెండింగ్‌లో ఉన్న బిల్లులు
ప్రభుత్వ భవనాలు	రూ. 20 కోట్లు
సీసీ రోడ్లు	రూ. 22 కోట్లు
గడపగడప పనులు	రూ. 7 కోట్లు
ఎంపీ నిధులతో చేసిన పనులు	రూ.8.42 కోట్లు
సీఎండీఎఫ్ కింద చేసిన పనులు	రూ. 1.20 కోట్లు
డీఎంఎఫ్ కింద చేసిన పనులు	రూ. 2కోట్లు
మొత్తం	రూ. 60.62 కోట్లు

అనంతపురం సిటీ, జూన్ 1 : జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల గండం పట్టుకుంది. ఎన్నికల పక్రియ నేపథ్యంలో బిల్లులు ఎప్పుడు వస్తాయో..? తెలియని అయోమయంలో ఉన్నారు. శాఖ పరంగా అధికారిక లెక్కల ప్రకారం.. రూ. 60.62 కోట్లు బిల్లులు ఇప్పటికి పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా గడపగడప, ఎంపీ నిధులు, సీఎం డెవలప్‌మెంట్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పాటు వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ/ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు తదితర ప్రభుత్వ భవనాల బిల్లులు సైతం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం గమనార్హం. బిల్లుల పెండింగ్‌తో ఎక్కడిక్కడ నిర్మాణాలు ఆగపోయాయి. ఇక నాలుగు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వస్తుండటంతో బాధి త కాంట్రాక్టర్లలో మరింత కలవరం మొదలైంది. ఒకవేళ ప్రభుత్వం మారితే తమ బిల్లుల సంగతేమిటనే ఆందోళన నెలకుంది.





ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో రోడ్లు వేస్తున్న దృశ్యం (ఫైల్)

పనుల పురోగతి అంతంతే

వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో పంచాయతీ రాజ్‌శాఖ పరంగా జిల్లా ఎక్కడా ఆశించిన స్థాయిలో పనులు చేయలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, భవనాల పరిస్థితి దయ నీయంగా మారింది. పనులు ఎక్కడిక్కడ ఆగిపోయాయి. బిల్లుల మంజూరులో జాప్యమే ఇందుకు ప్రధాన కారణమని బాధిత కాంట్రాక్టర్లు, అధికార వర్గాల నుంచి సమాచారం. కేంద్రం మంజూరు చేసే నిధులతో చేపట్టిన పనులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వేగవం తంగా చేయలేక పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల కిందట కేంద్రం నిధుల ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించదనే ఆరోపణలు లేక పోలేదు. దీంతో పీఆర్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం అవుతోందని ఆ శాఖ వర్గాల నుంచే వినిపిస్తోంది. ప్రభు త్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ/ వార్డు సచివాల యాలు, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ల భవనాల నిర్మాణాలు అంతంత మాత్రం గానే సాగుతుండటం గమనార్హం. డిజిటల్ లైబ్రరీల పరిస్థితి మరీ దారుణం. మొత్తం 186 మంజూరు చేస్తే.. ఒక్కటి కూడా పూర్తి కాలేదు. అలాగే మంజూరైన 469 సచివాల యాలకు గాను 320, 411 రైతు భరోసా కేంద్రాలకు గాను 240, 326 వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్ లకుగాను 163 మాత్రమే ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. మిగిలిన వాటిలో చాలా వరకు పునాదుల్లోనే దర్శనమిస్తున్నాయి. వీటిలో 288 భవనాల పనులను పూర్తిగా నిలిపి వేశారు.



డి.హీరేహాళ్ మండల పరిధిలోని పులపర్తిలో నిర్మిస్తున్న సచివాలయం (ఫైల్)

దిక్కు తోచని స్థితి..

జిల్లా పంచాయతీశాఖ పరిధిలో జరిగిన పనుల పరంగా.... అధికార లెక్కల ప్రకారం రూ. 60.62కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ వస్తుందని అధికారుల ఒత్తిళ్లతో కాంట్రాక్టర్లు.... నోటిషపికేషన్ వెలువడేందుకు ముందు నెలరోజుల పాటు హడావిడిగా పనులు చేసి బిల్లులు పెట్టారు. బిల్లులు చెల్లించే లోగా ఎన్నికల పక్రియ ప్రారంభమైంది. మరో నాలుగు రోజుల్లో ఓట్ల లెక్కింపు ఉండటంతో బాధిత కాంట్రాక్టర్లలో బిల్లుల ఆందోళన మొదలైంది. ఈ ఐదేళ్ల కాలంలో ఏనాడూ చేసిన పనులకు వెంటనే బిల్లులు రాలేదు. ఇందులో వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తదితర వాటి పనులకు కూడా ఏళ్ల తరబడి బిల్లులను పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం మారితే.. తకు బిల్లులు వస్తాయా..? లేదా.. అనే అయోమయం కాంట్రాక్టర్లలో నెలకుంది.

బిల్లుల పెండింగ్ వాస్తవమే



జిల్లాలో జరిగిన పలు పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. ఇటీవల కొన్ని బిల్లులు మంజూరయ్యాయి. త్వరలోనే మిగిలినవి మంజూరవుతాయని ఉన్నతాధికారులు తెలిపారు. పెండింగ్ బిల్లుల విషయం ప్రభుత్వానికి నివేదించాం. కాంట్రాక్టర్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

\- ఈరస్వామి, ఎస్ఈ, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ

టీబీ డ్యాంకు మొదలైన వరద



రాయదుర్గం, జూన్ 1: తుంగభద్ర జలాశయానికి వరద మొదలైంది. ఈ సీజన్‌లో తొలిసారి జలాశయంలోకి శనివారం 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గత ఏడాది ఈ సమయానికి వెయ్యి క్యూసెక్కులకు పైగా వరద ఉంది. కానీ ఎగువన వర్షాలు కురవకపోవడంతో ఆశించిన స్థాయిలో వరద చేరలేదు. ప్రస్తుతం నైరుతి రుతు పవనాల ప్రభావంతో జలాశయం ఎగువ ప్రాంతాలైన ఆగుంబి, శృంగేరి, తీర్థహళ్లి తదితర ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగా వరదనీరు జలాశయంలోకి చేరడం మొదలైంది. ప్రస్తుతం జలాశయంలో డెడ్ స్టోరేజీ ఉంది. 1577.40 అడుగుల వద్ద 3.38 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 4.78 టీఎంసీల నీటి నిల్వలు ఉండేవి. సాధారణంగా ఈ సమయానికి జలాశయంలో ఏడు టీఎంసీలకు పైగా నీటి నిల్వ ఉండాలి. వరద మొదలు కావడంతో బోర్డు అధికారులు జలాశయంపై నిఘా పెంచి, పర్యవేక్షిస్తున్నారు.

నాలుగు గనుల సర్వే పూర్తి



సర్వే నిర్వహిస్తున్న బృందం

రాయదుర్గం, జూన్ 1: అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న మైనింగ్ గనుల్లో నాలుగు గనుల సర్వే పూర్తి అయింది. శనివారం మూడవరోజు సర్వే ప్రక్రియను బృందం కొనసాగించింది. కర్ణాటకలో ఉన్న ఏడు మైనింగ్ గనుల్లో ఇప్పటికే నాలుగు పూర్తి అయినట్లు బృందం తెలిపింది. ముఖ్యంగా కర్ణాటకలోని టుముటి, విఠలాపురం గ్రామాలతో పాటు బేకూరు గ్రామంకు ఆనుకుని ఉన్న నాలుగు గనుల హద్దులను గుర్తించి సర్వే పూర్తి చేశారు. మిగిలిన మూడు గనుల సర్వే ప్రక్రియను సోమవారం నుంచి కొనసాగించనున్నారు. ప్రధానంగా మైనింగ్ లీజు కేటాయించేటపుడు రెవెన్యూ గ్రామ సరిహద్దులను ఆధారంగా చేసుకుని త్రవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. అదే విధంగా మరో వైపు నుంచి కొందరు మైనింగ్ యజమానులు రెవెన్యూ సరిహద్దులు దాటుకుని 300 మీటర్ల మేరకు త్రవ్వకాలు చేసినట్లు గుర్తించారు. సుప్రీంకోర్టు నిర్ణయించిన అంతర్రాష్ట్ర సరిహద్దును ఆనుకుని ఉన్న మైనింగ్‌లలో ఆయా యజమానుల సమక్షంలో సర్వే జరిపి ఒప్పుకున్నట్లు సంతకాలు కూడా కేంద్రం బృందం తీసుకుంటుంది. దీంతో ఇప్పటివరకు ఏడు గనులకు గాను నాలుగు గనుల హద్దులను నిగ్గుతేల్చి సర్వేను పూర్తి చేశారు. మిగిలిన మూడు గనుల సర్వేను సోమవారం నుంచి మొదలుపెట్టి ఆరవ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు బృందం తెలిపింది. సర్వే కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ సూరత్ హర్షవర్ధన్, డీఎఫ్ఓ వినీత్‌నాయక్, సీనియర్ జియాలజిస్టు చంద్రు, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు

అనంతపురం అర్బన్, జూన్ 1 : టీఎన్‌టీయూసీ జిల్లా కమిటీలో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి చోటు లభించింది. టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వడ్డే వెంకటరాముడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మదన్‌మోహన్‌లను నియమించారు. ఈ మేరకు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు శనివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

48,749 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 1 : జిల్లాలోని ఆర్బీకేల్లో శనివారం ఎనిమిదో రోజు విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 55,318 మంది రైతులకు 48,749 క్వింటాళ్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 72,538 మంది రైతులు 64,059 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

చీనీ కాయలు టన్ను రూ.38వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టం రూ.38వేలు, కనిష్టంగా రూ.15వేలు, సరాసరి రూ.24వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

ఓపెన్‌ఎయిర్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెట్‌గా రెహమాన్

బుక్కరాయసముద్రం, జూన్ 1: అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా జిల్లా జైలు సూపరింటెండెంట్ షఫివుల్ రెహమాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఓపెన్‌ఎయిర్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న చిన్నారావు శుక్రవారం పదవీరమణ చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి జైలు సూపరింటెండెంట్‌గా రెహమాన్‌ను నియమించారు.

ఆర్జిత కల్యాణోత్సవ తేదీలు ఖరారు

కదిరి, జూన్ 1: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జూన్‌నెలలో జరిగే ఆర్జిత కల్యాణోత్సవ తేదీలను ఆలయ అధికారులు శనివారం వెల్లడించారు. కల్యాణోత్సవం టిక్కెట్ ధర రూ. నాలుగు వేలు ఉంటుందన్నారు. జూన్‌లో 2, 3, 7, 10, 11, 12, 13, 14, 16, 17, 19, 20, 24, 25, 26, 27, 28వ తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఆలయ ఈఓ కార్యాలయంలో సంప్రందించాలని వారు సూచించారు.

నలుగురిని బలితీసుకున్న ప్రమాదాలు

- ముగ్గురికి గాయాలు



సీకే పల్లి వద్ద ఆటో ప్రమాద దృశ్యం... మృతి చెందిన నారాయణ, కిష్టయ్య(ఫైల్)

చెన్నే కొత్తపల్లి, హిందూపురం అర్బన్, పుట్టపర్తి రూరల్, జూన్ 1: శ్రీసత్యసాయి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృత్యువాతపడ్డారు. ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు ధర్మవరం పట్టణవాసులు, ఒకరు తమిళనాడువాసి, మరొకరు వైసీపీ కొత్తచెరువు మండల కన్వీనర్. గాయపడ్డ ముగ్గురు తమిళులు.

ఆటోను 407 ఢీకొట్టడంతో..

చెన్నేకొత్తపల్లి మండలం చిన్నపరెడ్డిపల్లి కాలనీ వద్ద ఆటోను 407 వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ధర్మవరం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురం కాలనీకి చెందిన గొల్ల నారాయణ(54) తన ఆటోలో ఇందిరమ్మ కాలనీకి చెందిన కె.కిష్టయ్య(67)తో కలిసి బాడుగకు కొత్తచెరువుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. చిన్నపరెడ్డిపల్లి కాలనీ వద్దకు రాగానే ధర్మవరం వైపు నుంచి ఎదురుగా వచ్చిన 407 వాహనం ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. నారాయణకు భార్య తిప్పమ్మ, ఇద్దరు కుమారులు హరీ, సురేశ్ ఉన్నారు. కిష్టయ్యకు కుమారుడు వేమనారాయణ, కూతురు పద్మావతి ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 407 వాహనం డ్రైవర్ పరారయ్యాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

కారు బోల్తా పడి..

పరిగి మండలం ధనాపురం సమీపంలో కారు బోల్తాపడి తమిళనాడుకు చెందిన రాజశేఖర్(50) మృతిచెందారు. తమిళమణి, సెల్వరాజ్, రామకృష్ణన్ గాయపడ్డారు. తమిళనాడులోని ధర్మపురి జిల్లా పెన్నాగరం గ్రామానికి చెందిన వీరు నలుగురూ ఎక్స్‌కవేటర్ అద్దె వసూలు చేసేందుకు శనివారం ఉదయం హోసూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు బయలుదేరారు. ధనాపురం వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో రాజశేఖర్(50) అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన ముగ్గురు గాయపడ్డారు. వీరిని హిందూపురం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ మండల కన్వీనర్..

పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలోని వై జంక్షన్‌లో ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొనడంతో వైసీపీ కొత్తచెరువు మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి (55) మృతిచెందారు. కొత్తచెరువు మండలం నారేపల్లికి చెందిన ఆయన పుట్టపర్తికి వెళుతుండగా వెలుతుండగా పుట్టపర్తి నుంచి మామిళ్ళకుంట కూడలివైపు వెళుతున్న బొలెరో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన జగన్‌మోహన్‌రెడ్డిని పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు.



పరిగి మండలంలో ప్రమాదానికి గురైన కారు.. గాయపడిన సెల్వరాజ్

భక్తిశ్రద్ధలతో.. హనుమజ్జయంతి

● ఆలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు ● పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: హనుమజ్జయంతి వేడుకలు పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గ కేంద్రాలు, మండలకేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలు, ఇతర ఆలయాల నిర్వాహకులు, కమిటీల సభ్యులు, భక్తులు పెద్దఎత్తున వేడుకలను జరిపారు. దీంతో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. వేకువజామునే అర్చకులు ఆలయాల్లోని ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకంతో పాటు పలు అభిషేకాలు చేశారు. అనంతరం పూలమాలలు, వడమాలలు, తోమాలలతో అలంకరణ, ఆభరణాల సేవతో పాటు ప్రత్యేకాలంకరణలు గావించారు. తర్వాత సుప్రభాత సేవ, కలశ స్థాపన, గణపతిపూజ, స్వస్తివాచనము కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా సింధూరార్చన, ఆకుపూజ, హనుమాన్‌చాలీసా పారాయణం, రుద్రహోమం, మహామంగళహారతి, మహా నైవేద్యంతో పాటు వివిధ ప్రత్యేక పూజలు చేపట్టారు. తర్వాత భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. ఆలయాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం జరిగింది. పలు గ్రామాల్లో ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలను, చిత్రపటాలను పల్లకిలో ఉంచి పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. జై హనుమాన్ అన్న భక్తుల నినాదాలతో ఆలయాలు మార్మోగాయి.


పుట్టపర్తిలో ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి


ధర్మవరం: మాధవ నగర్‌లోని చెలిమి సీరామాంజనేయస్వామి ఆలయంలో..


కొత్తపేట ఆలయంలో..


కదిరి పట్టణంలోని సైదాపురంలో..


ముదిగుబ్బలో ..


గాండ్లపెంట మండలం మునగాలవారిపల్లిలో..


ఓడీసీ మండలం గాజుకుంటపల్లిలో..


కదిరిలోని మరకతమహాలక్ష్మి ఆలయంలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి


ధర్మవరంలోని చెలిమి ఆలయంలో భక్తులకు అన్నదానం..

మూఢనమ్మకాలు వీడాలి: జేవీవీ

కదిరి అర్బన్, జూన్ 1: ప్రతిఒక్కరూ మూఢనమ్మకాలు వీడాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నరసారెడ్డి సూచించారు. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం, చిత్రలేఖనం, గణితం, మ్యాజిక్స్ లాంటి అంశాల్లో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి నరసారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలోనూ కొందరు మూఢనమ్మకాలను నమ్మడం బాధాకరమన్నారు. మూఢనమ్మకాలను వీడాలన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన చేసిన ఫైర్ మిరాకిల్స్ మ్యాజిక్ విద్యార్థులను ఆకట్టుకుంది. తర్వాత విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త చెంద్రాయుడు, హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 37 మంది గైర్హాజరు

కొత్తచెరువు, జూన్ 1: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 37 మంది గైర్హాజరయ్యారని పరీక్ష నిర్వాహణ అధికారి లాజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాలలో సంస్కృతం, ఉర్దూ పరీక్షలు నిర్వహించామన్నారు. ఇందులో 85 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 48 మంది వచ్చారని తెలిపారు. మిగిలిన 37 మంది గైర్హాజరయ్యారన్నారు. దీంతో హాజరు 56శాతం నమోదైందన్నారు.

తాగునీటి ట్యాంకు చుట్టూ తీవ్ర అపరిశుభ్రత

● నీరు పట్టుకోవాలంటే ఇబ్బంది పడుతున్న ప్రజలు

ముదిగుబ్బ, జూన్ 1: మండలంలోని పొడరాళ్లపల్లిగ్రామంలో తాగునీటి ట్యాంకు చుట్టూ తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. వృథాగా పోయే తాగునీరంతా ట్యాంకు చుట్టూ నిల్వ ఉండి మురుగుగా మారింది. ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొని ఉండడంతో అక్కడ కొళాయిల ద్వారా నీరు పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. మురుగు వల్ల దుర్గంధం వెదజల్లుతోందని, ఆ కంపులో నిలబడి నీళ్లు పట్టుకోవాలంటే ఇబ్బందిగా ఉందని అంటున్నారు. అపరిశుభ్రత తొలగించాలని కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటున్నారు. మురుగు పేరుకుపోవడం వల్ల మంచినీరు కూడా కలుషితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు.


తాగునీటి ట్యాంకు చుట్టూ పేరుకున్న మురుగునీరు

ఏ నలుగురు కలిసినా.. ఎన్నికల చర్చే

● ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

తనకల్లు, జూన్ 1: గతనెల 13వ తేదీ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇక అప్పటి నుంచి మండలంలో ఎక్కడ ఏ నలుగురు కలిసినా అభ్యర్థుల గెలుపు ఓటములపైనే చర్చలు సాగుతున్నాయి. అంతేకాకుండా మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని బట్టి ఆయా బూత్‌లలో తమ పార్టీకంటే తమ పార్టీకే మెజార్టీ వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. మరికొందరు పెన్ను, పేపర్ చేతపట్టి మరీ లెక్కలు వేసి గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. టీ దుకాణాలు, కాకా హోటళ్లు, రచ్చబండలపై నలుగురు కలిస్తే చాలు అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చ పెడుతున్నారు. కొందరైతే గెలుపు ఓటములపైన లెక్కలేసుకుంటూ ధీమాగా పందెలు కూడా కాస్తున్నారు. ఓవైపు కదిరి అసెంబ్లీ స్థానంతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఎవరు చేపడతారన్న విషయంపై కూడా పందేలు కాస్తున్నారు. ఓట్ల లెక్కింపు ఈనెల 4వ తేదీన అధికారులు నిర్వహించనున్నారు. సమయం దగ్గర పడేకొద్దీ తీవ్ర ఉత్కంఠ నెలకొంటోంది. మహిళల ఓట్లు తమ పార్టీకే పడ్డాయని కొందరు చర్చలు చేస్తుండగా.. లేదు తమ పార్టీకే పడ్డాయని వాదించుకుంటున్నారు. ఏది ఏమైనా ఈనెల 4వతేదీన పూర్తి స్థాయిలో ఫలితాలు వెల్లడవుతాయని, అంతవరకు ఓపిక పట్టాలని వయస్సు పైబడిన వారు సలహాలిస్తున్నారు.

జూన్ వచ్చినా తగ్గని ఎండలు

● 40 డిగ్రీల పైనే నమోదవుతున్న ఉష్ణోగ్రత
● నిర్మానుషంగా ప్రధాన రహదారి

నంబులపూలకుంట, జూన్ 1: జూన్ నెల వచ్చినా ఇంకా ఎండలు మండుతూనే ఉన్నాయి. గత మూడురోజులనుంచి ఎండలు తీవ్రత అధికంగా ఉంటోంది. దీంతో ఉదయం 9గంటల నుంచే వేడిమి, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇళ్ల నుంచి బయటికి రావాలంటే జంకుతున్నారు. దీంతో జన సంచారం లేక ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. సాయంత్రం 5గంటలైనా వేడి తగ్గకపోవడంతో జనం బయటికి రాలేకపోతున్నారు. 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత ఉంటోంది. ఇళ్లలో చిన్నారులు, వృద్ధు లు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఎన్పీకుంట మండల కేంద్రంలో శనివారం రోడ్లన్నీ జనసంచారం లేక ఖాళీగా దర్శనమిచ్చాయి.


ఎన్పీకుంటలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు

ఒకరి బదులు మరొకరు పరీక్ష రాస్తూ...

● రెడ్‌హ్యాండెడ్‌గా డీఈఓకు చిక్కిన వైనం

అనంతపురం విద్య, జూన్ 1: ఒకరి స్థానంలో మరొకరు వచ్చి పరీక్ష రాశారు. ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఓపెన్ టెన్త్‌తోపాటు, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 7 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. అనంతపురం నగరంలో 4 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుంటే రాయదుర్గం, తాడిపత్రిలోని మరో మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. అనంతపురం నగరంలోని శారద స్కూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రంలోని ఒక సెంటర్‌లో ఒక విద్యార్థి బదులు మరో విద్యార్థి పరీక్ష రాసేందుకు హాజరైనట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. డీఈఓ తనిఖీలో విషయం బహిర్గతమైనట్లు తెలిసింది. రాజేంద్ర మున్సిపల్ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో తనిఖీల తర్వాత డీఈఓ శారద స్కూల్ విజిట్‌కు వెళ్లారు. ఆ సెంటర్‌లో ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాస్తుండటం ఆమె గుర్తించినట్టు తెలిసింది. విద్యార్థిని ఏం చదువుతున్నా..? మీ తల్లిదండ్రుల పేర్లు ఏంటి అంటూ ప్రశ్నించడంతో ఆ విద్యార్థి తడబడటంతో విషయం బయటపడినట్లు తెలిసింది. ఒకరి బదులు మరొకరు ఎలా రాస్తారంటూ డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అయితే ఆ కేంద్రంలోని కొందరు పరీక్షల విధులకు పడిన అధికారులు ఈ విషయం బయటకు పొక్కకుండా విశ్వప్రయత్నాలు చేసినట్టు సమాచారం. ఈ ఘటనపై వివరణ కోరడానికి డీఈఓకు ఫోన్ చేయగా డీఈఓ అందుబాటులోకి రాలేదు.

పలు గ్రామాల్లో పోలీసుల పర్యటన

బత్తలపల్లి, జూన్1: మండలంలోని ఉప్పర్లపల్లి, దంపెట్ల గ్రామాల్లో శనివారం ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బంది కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అనుమనితుల ఇళ్లల్లో, ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎస్ఐ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. లేదా పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎవరూ ఎలాంటి గొడవలకు వెళ్లరాదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నల్లచెరువు, జూన్ 1: ఎన్నికల కోడ్ ఈనెల 6వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఎస్ఐ కేఎం. లింగన్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. కౌటింగ్ రోజున ఎవరూ రోడ్లపై గుంపులుగా కనిపించరాదన్నారు. అందరూ ఇళ్లల్లోనే ఉండాలన్నారు. కౌటింగ్ పూర్తి అయిన తరువాత ఎలాంటి సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ర్యాలీలు నిర్వహించరాదు

నంబులపూలకుంట, జూన్ 1: ఓట్ల లెక్కింపును ఈనెల 4వ [illegible] తేదీన నిర్వహించడం జరుగుతోందని ఎస్ఐ శ్రీధర్ శనివారం ప్రకటనలో తెలిపారు. కౌటింగ్ అనంతరం గెలుపు ఓటములపై అన్ని పార్టీల వారు సంమయమనం పాటించాలన్నారు. గెలుపొందిన పార్టీల నాయకులు, కార్యకర్తలు, విజయోత్సవ సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయకూడదన్నారు. అలా నిర్వహించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారపు సంత మార్పు

నల్లమాడ, జూన్ 1: ఈనెల 4వతేదీ మంగళవారం ఓట్ల లెక్కింపు ఉండడంతో, మండలకేంద్రంలోని వారపు సంతను సోమవారానికి మార్చినట్లు పంచాయతీ కార్యదర్శి జనార్దన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇక్కడ వారపు సంతను ప్రతి మంగళవారం నిర్వహించేవారమని, అయితే ఈ వారం ఓట్ల లెక్కింపు ఉండడంతో సోమవారం సంత నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈవిషయాన్ని వ్యాపారులు, వినియోగదారులు గమనించాలని కోరారు.

రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికసాయం

కదిరిఅర్బన్, జూన్ 1: కదిరి ఆర్టీసీ డిపోలో వివిధ హోదాల్లో పని చేసి రిటైర్డ్ అయి అనంతరం మృతిచెందిన వారి దహన సంస్కారాల నిమిత్తం డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తూ రిటైర్డ్ అయిన అనంతరం మృతిచెందిన నగేష్, లక్ష్మీపతి, ఆలీ కుటుంబసభ్యులకు ఆయన నగదు అందజేశారు. ఒక్కోకుటుంబానికి రూ.15వేల చొప్పున అందించారు.

పండ్లతోట పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓబుళదేవరచెరువు, జూన్ 1: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 5ఎకరాల లోపు ఉన్న రైతులు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వరలక్ష్మి, ఏపీఓ సుధాకర్ సూచించారు. మండలకేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు మామిడి, అల్లనేరేడు, జామ తదతర పండ్ల మొక్కలు సాగుచేసి మూడు సంవత్సరాలపాటు సంరక్షించాలన్నారు. అందుకు బిల్లులు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈనెల 6వ తేదీలోపు రైతులు దరఖాస్తులను క్షేత్రసహాయకులకు అందించాలన్నారు. దరఖాస్తు ఇచ్చిన నాలుగు రోజుల్లో పనులు ప్రారంభిస్తారన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోరుగా మద్యం విక్రయాలు

గాండ్లపెంట, జూన్ 1: మండలంలోని పలు గ్రామాల్లో ఆంధ్ర, కర్ణాటక మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. కటారుపల్లి, మల్లమీదపల్లి, రెక్కమాను, సీఎంతండా, చామలగొంది తదితర గ్రామాల్లోని బెల్టుషాపుల్లో ఇక్కడి మద్యంతోపాటు, కర్ణాటక మద్యంను జోరుగా విక్రయిస్తున్నట్లు ఆగ్రామీణులు వాపోతున్నారు. బెల్టు షాపుల్లో మద్యం ఉదయం 5 గంటల నుంచే లభిస్తోందని పలువురు మద్యంప్రియులు చెబుతున్నారు. వీటిపై నిఘా ఉంచాల్సిన పోలీసులు, సెబ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఈ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

మొరాయించిన సర్వర్లు

● పింఛన్ కోసం సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు

గాండ్లపెంట, జూన్ 1: మండల వ్యాప్తంగా పలు గ్రామాల సచివాలయాల్లో శనివారం సర్వర్లు మొరాయించాయి. దీంతో పింఛన్ కోసం వచ్చిన లబ్ధిదారులు ఆయా సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మండల వ్యాప్తంగా 4,324మంది వివిధ రకాల పింఛన్‌దారులున్నారు. అయితే వారిలో కొంతమందికి పింఛన్ సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మరి కొంతమందికి సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 1వ తేదీ కావడంతో కొంతమంది పింఛన్‌దారులు సచివాలయం వద్దకు ఉదయాన్నే వచ్చారు. అయితే సర్వర్లు పూర్తిగా పనిచేయలేదు. దీంతో పింఛన్‌దారులు, ముఖ్యంగా వృద్ధులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా సేపటి తర్వాత సర్వర్లు కొద్దిసేపు పని చేయడంతో అరాకొర మందికి పింఛన్లను పంపిణీ చేశారు.


గాండ్లపెంట సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

9న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జూన్ 1: పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ ప్రెసిడెంట్ జయసింహ, కార్యదర్శి నాగభూషణ సూచించారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక సాంస్కృతిక మండలిలో వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి సహకారంతో, మామిళ్ల రంగనాయకులు కుటుంబసభ్యుల సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని కంటిచూపు మందగించిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగల అరెస్ట్

గుంతకల్లుటౌన్, జూన్ 1: గుంతకల్లు-గుత్తి ఎన్‌హెచ్ 67 హైవే నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని సుధాకర్ రెడ్డి కోళ్లఫారం వద్ద లారీ డ్రైవర్, క్లినర్‌ను బెదరించిన సంఘటనలో ఇద్దరు దొంగలను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను శనివారం సీఐ మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. కర్ణాటక హొసపేటలో ఓ ఫ్యాక్టరీ నుంచి లారీ స్లాగ్ లోడుతో జమ్మలమడుగులోని దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీకి గురువారం సాయంత్రం బయలుదేరారు. రాత్రి నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని సుధాకర్ రెడ్డి కోళ్లఫారం వద్ద బొలెరో వాహనం వెనుక నుంచి ఓవర్‌టేక్ చేసి లారీని అడ్డుకున్నారు. డ్రైవర్ లారీని ఐటీసీ డిపో వద్ద పక్కన ఆపారు. బొలెరో వాహనంలో నుంచి ముగ్గురు వ్యక్తులు డ్రైవర్ ఇసాక్, క్లీనర్ సునీల్‌తో వాదనకు దిగి వారిని కిందకు లాగి చితకబాదారు. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో రెండు సె ల్‌ఫోన్లను లాక్కొని పరారయ్యారు. లారీ డ్రైవర్ ఇసాక్ శుక్రవారం రూరల్ పోలీసులకు ఫి ర్యాదు చేశాడు. రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ దారి దోపిడీ దొంగల కోసం గా లింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు నలుగురు వ్యక్తులు ముగ్గలు వ్యక్తులు తెల్ల బొలెరో వాహనంలో గుత్తి నుంచి బళ్లారికి వెళ్తుండగా గొల్లలదొడ్డి క్రాస్ వద్దవారిని గుర్తించామన్నారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన చిన్న కందుకూరి ఆజేయ్, బెల్లంప్రశాంత్, గుత్తిమండలం లచ్చానుపల్లికి చెందిన వడుగూరు ఆదర్శలను అరెస్ట్ చేశామన్నారు. మరో వ్యక్తి జీవన్‌కుమార్ పరారీలో ఉన్నాడన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

కారు.. ఐచర్ ఢీ.. ఒకరి మృతి

తాడిపత్రిటౌన్, జూన్ 1: మండలంలోని వంగనూరు గ్రామసమీపంలో శనివారం తెల్లవారుజామున కారు-ఐచర్ ఢీకొన్న సంఘటనలో పట్టణంలోని అంబాభవాని వీధికి చెందిన సుబ్బయ్య (35) మృతిచెందాడు. శ్రీనివాసపురానికి చెందిన రామకృష్ణారెడ్డి, ఆర్టీటీ కాలనీకి చెందిన వెంకటేష్ గాయపడ్డారని రూరల్ పోలీసులు తెలిపారు. సుబ్బయ్య కొన్నేళ్లక్రితం కడపజిల్లా వల్లూరు మండలం దుగ్గయ్యపల్లి గ్రామం నుంచి ఉపాధినిమిత్తం తాడిపత్రికి వలస వచ్చాడు. బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుబ్బయ్య అతని మిత్రులతో కలిసి వ్యక్తిగత పనినిమిత్తం సొంత గ్రామమైన దుగ్గయ్యపల్లికి కారులో వెళ్లాడు. తిరుగుప్రయాణంలో వంగనూరు గ్రామ సమీపంలోకి రాగానే ఐచర్ ఢీకొనడంతో అక్కడికక్కడే సుబ్బయ్య మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సుబ్బయ్యకు భార్య సుభాషిణి, కుమారుడు చక్రి, కుమార్తె హరిత ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పెనుకొండ రూరల్, జూన్ 1 : రొద్దం మం డలం పెద్దకోడిపల్లి సమీ పంలో కె లక్ష్మి(35) అనే మహిళ శనివారం ఉరివే సుకుని ఆత్మహత్యకు పా ల్పడినట్లు ఎస్ఐ వలీబాష తెలిపారు. దర్మవరం పట్టణంలోని దుర్గానగర్ కు చెందిన ఎరుకల గజ్జల శంకర్‌తో ఆమెకు ఏడాది కిం దట వివాహమైంది. కుటుంబ కలహాలతో ఆమె మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటికి వచ్చేసింది. ఈ క్రమంలో ఆమె శుక్రవారం సాయంత్రం రొద్దం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనకు న్యాయం చేయాలని కోరినట్లు పోలీసులు తెలిపారు. ఉదయాన్నే వచ్చి విచారించి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆమె వెనుదిరిగిం ది. అయితే శనివారం ఉదయమే పెద్దకోడిపల్లి సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలీబాష తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

శాంతిభద్రతలకు భంగం కలిగించరాదు

ముదిగుబ్బ, జూన్ 1: ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో శాంతిభద్రతలకు ఎవరూ భంగం కలిగించరాదని ముదిగుబ్బ రూరల్ సీఐ కృష్ణంరాజునాయక్ సూచించారు. పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు రోడ్లపై గుంపులుగా ఉండరాదన్నారు. కౌంటింగ్ తర్వాత సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. బాణాసంచా కూడా కాల్చరాదన్నారు. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్నం ఎస్ఐ నరసింహుడు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తనకల్లు, జూన్ 1: మండలకేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బుచ్చినారాయణప్ప గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ రూ.20 వేలు ఆర్థికసాయాన్ని శనివారం టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి చేతులమీదుగా అందించారు. శేఖర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, తోట సరోజమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం, జూన్ 1: ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుందని, కనుక ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌంటింగ్ రోజు ఏజెంట్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమర పాటుగా వ్యవహించరాదన్నారు. సత్యకుమార్ యాదవ్ తప్పకుండా అత్యధిక మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సత్యకుమార్ గెలిస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎంతో కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జింకాచంద్రశేఖర్, సాకే ఓబుశేశు, నాయకులు బొట్టుశ్రీనివాసులు, నరసింహులు, యువమోర్చా జిల్లాకార్యదర్శి కార్తీక్, నాయకులు గరువు వెంగప్ప, ఆదినారాయణ, మైనార్టీ నాయకులు నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్

మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

అగళి, జూన్ 1 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. అందుకు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఏడో తరగతిలో 50, ఎనిమిదో తరగతి 24, తొమ్మిదో తరగతిలో 17సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను అగళి ఆదర్శ పాఠశాలలో ఈ నెల 7వ తేదీలోగా అందజేయాలన్నారు. అర్హత కలిగిన వారికి ఈ నెల 10న అగళి ఆదర్శ పాఠశాలలో ఉదయం 10గంటలకు పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాబ్‌మేళాలో 65 మంది ఎంపిక

హిందూపురం అర్బన్, జూన్ 1: పట్టణ పరిధిలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో శ్రీనివాస బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో 65 మంది ఎంపికైనట్లు వర్క్ అపాయింట్‌మెంట్ మేనేజర్ అసితోష్ తెలిపారు. ఈ జీబ్‌మేళాకి 120 మంది అభ్యర్థులు హాజరుకాగా అందులో ప్రతిభ కనబరిచిన 65 మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు వంశీకృష్ణ, కిషోర్, శ్రీనివాస బాలాజీ ఫౌండర్ రఘునాథ్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

మడకశిర రూరల్, జూన్ 1: టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచు నాగరాజు మృతి పార్టీకి తీరని లోటని పార్టీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. మండలంలోని గౌడనహళ్లికి చెందిన నాగరాజు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీ పీ నాయకులు బీకే పార్థసారథి, గుండుమల తిప్పే స్వామి గౌడనహళ్లికి వెళ్లి నాగరాజు మృతదేహంపై పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ... నాగరాజు మృతి పార్టీకి తీరని లో టన్నారు. కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉం టుందన్నారు. నాగరాజు కుటుంబసభ్యులను ఓదార్చారు. వారి వెంట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ అశ్వత్థనారాయణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య


లక్ష్మి మృతదేహం

పెనుకొండ రూరల్, జూన్ 1 : రొద్దం మండలం పెద్దకోడిపల్లి సమీపంలో కె లక్ష్మి(35) అనే మహిళ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వలీబాష తెలిపారు. ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన ఎరుకల గజ్జల శంకర్‌తో ఆమెకు ఏడాది కిందట వివాహమైంది. కుటుంబ కలహాలతో ఆమె మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటికి వచ్చేసింది. ఈ క్రమంలో ఆమె శుక్రవారం సాయంత్రం రొద్దం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనకు న్యాయం చేయాలని కోరినట్లు పోలీసులు తెలిపారు. ఉదయాన్నే వచ్చి విచారించి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆమె వెనుదిరిగింది. అయితే శనివారం ఉదయమే పెద్దకోడిపల్లి సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలీబాష తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

జమ్ములబండలో యువకుడు...

గుడిబండ, జూన్ 1 : మడకశిర పట్టణానికి చెందిన మునవ్విర్‌ఖాన్(35) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. గుడిబండ మండలం జమ్ములబండ భూతప్ప గుడి అటవీప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు శనివారం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులుసంఘటనా స్థలానికి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఉంది. పెళ్లై మూడేళ్లయినా పిల్లలు లేరు. మృతికి గల కారణాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకున్ని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డిటొనేటర్ నమిలి గేదెకు గాయాలు

పెనుకొండ రూరల్, జూన్ 1: రొద్దం మండలంలోని చిన్నచెరువుకట్ట కింద మేతకోసం వెళ్లిన ఓ గేదె డిటొనేటర్ నమిలింది. దీంతో గేదె దవడ పేలిపోయి తీవ్రంగా గాయపడింది. మండలకేంద్రమైన రొద్దం గ్రామానికి చెందిన పాడి రైతు రామాంజినేయులు శనివారం ఉదయం మేతకోసం నాలుగు గేదెలను తీసుకెళ్లాడు. అయితే అడవి పందులకోసం పెట్టిన పేలుడు పదార్థం తిని గేదె దవడ పేలిపోయింది. దీంతో పశు వైద్యుడిని పిలిపించి చికిత్సలు చేయించారు. అయితే ఆ గేదెను కబేళా తరలించాలని వైద్యుడు సూచించడంతో దానిని అమ్మేశాడు. ఈ సంఘటనతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు పాడిరైతు రామాంజినేయులు వాపోయాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రామాంజనేయులు వాపోయాడు.

వ్యవసాయ మంత్రిని కలిసిన పావగడ ఎమ్మెల్యే


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూన్ 1 : కర్ణాటక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చలవరాయస్వామిని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ శనివారం ఆయన గెస్ట్‌హౌస్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంతో పాటు పావగడ రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సబ్సిడీతో అందించాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ సంవత్సరం పంపిణీ చేస్తున్న వేరుశనగ నాణ్యతలేదని, సంబంధిత అధికారులతో చర్చించి రైతులకు నాణ్యమైన వేరుశనగ అందించాలని కోరానన్నారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా అందించాలని, అన్నివిధాలా ఆదుకోవాలని కోరానన్నారు.



ప్రత్యేక అలంకరణలో సూగూరు ఆంజనేయస్వామి మూలవిరాట్, స్వామి దర్శనానికి హాజరైన భక్తులు


కోటలోని ఆంనేయ స్వామి


ఆంజనేయుడిగా మునిసిపల్ కార్యాలయంలోని శ్రీనివాసుడు


పెనుకొండలోని ఊరు వాకిలి ఆంజనేయస్వామి


చెరువురోడ్డులోని ధ్వజముఖ ఆంజనేయస్వామి

పవనపుత్రా పాహిమాం..!

భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

హనుమజ్జయంతి వేడుకలను ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే మూల విరాట్లకు వివిధ అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, రామ కీర్తనలు, రామ నామం, ఆంజనేయ దండకంతో ఆలయాలు మార్మోగాయి.

పలు ఆలయాల్లో సీతారామకల్యాణోత్సవం నిర్వహించారు. తీర్థ ప్రసాద వినియోగంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహా లను, చిత్రపటాలను ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. హిందూపురంలోని మునిసిల్ కార్యాలయం వద్ద ఉన్న వేంకటేశ్వరాల యంలో స్వామిని ఆంజనేయుడిగా అలంకరించి, వడల హారంతో పూజలు చేశారు.


ధ్వజముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


కోనాపురంలో హనుమాన్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు


ఇస్లాపురంలో టీడీపీ నాయకుల పూజలు




మడకశిరలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి, ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో రావుడి ఆంజనేయస్వామి


ప్రత్యేక అలంకరణలో కొంకల్లు ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో బూదిలిఆంజనేయస్వామి, ఆలయంలో సీతారాముల కల్యాణం దృశ్యం


వానవోలు ఆంజనేయస్వామి


లేపాక్షిలో ఆంజనేయస్వామి

వైభవంగా చందకచర్ల ఆంజనేయస్వామి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో చందకచర్ల ఆంజనేయస్వామి


భక్తుల నడుమ కదులుతున్న ఆంజనేయస్వామి రథం

మడకశిర రూరల్, జూన్ 1: మడకశిర ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన చందకచర్ల ఆంజనేయ స్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంక రించారు. అర్చనలు తదితర పూజలు చేశారు. ఆలయం ఆరణంలో హోమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు జ్యోతుల తో ఊరేగింపుగా తీసుకొచ్చి మొక్కులు తీర్చుకున్నా రు. టీడీపీ హిందూపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బీ కే పార్థసారథి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి తదితరులు రథోత్సవంలో పాల్గొన్నారు. వారు ఆల యంలో స్వామివారి ప్రత్యేక పూజలు చేశారు, రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


జ్యోతులతో ఆలయాలనికి వెళ్తున్న మహిళలు


రథోత్సవంలో పాల్గొన్న బీకే, గుండుమల తదితరులు


జనసంద్రమైన దండురోడ్డు ఆంజనేయస్వామి ఆలయం


సూగూరు ఆలయం వద్ద హిందూసురక్ష సేవా సమితి అన్నదానం


కారు.. ఐచర్ ఢీ.. ఒకరి మృతి

తాడిపత్రిటౌన్, జూన్ 1: మండలంలోని వంగనూరు గ్రామసమీపంలో శనివారం తెల్లవారుజామున కారు-ఐచర్ ఢీకొన్న సంఘటనలో పట్టణంలోని అంభాభవాని వీధికి చెందిన సుబ్బయ్య (35) మృతిచెందాడు. శ్రీనివాసపురానికి చెందిన రామకృష్ణారెడ్డి, ఆర్టీటీ కాలనీకి చెందిన వెంకటేష్ గాయపడ్డారని రూరల్ పోలీసులు తెలిపారు. సుబ్బయ్య కొన్నేళ్లక్రితం కడపజిల్లా వల్లూరు మండలం దుగ్గయ్యపల్లి గ్రామం నుంచి ఉపాధినిమిత్తం తాడిపత్రికి వలస వచ్చాడు. బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుబ్బయ్య మిత్రులతో కలిసి వ్యక్తిగత పనినిమిత్తం సొంత గ్రామమైన దుగ్గయ్యపల్లికి కారులో వెళ్లాడు. తిరుగుప్రయాణంలో వంగనూరు గ్రామ సమీపంలోకి రాగానే ఐచర్ ఢీకొనడంతో అక్కడికక్కడే సుబ్బ య్య మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమి త్తం వారిని తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సుబ్బయ్యకు భార్య సుభాషిణి, కుమారుడు చక్రి, కుమార్తె హరిత ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

దారి దోపిడీ దొంగల అరెస్ట్

గుంతకల్లుటౌన్, జూన్ 1: గుంతకల్లు-గుత్తి ఎన్‌హెచ్ 67 హైవే నక్కనదొడ్డి గ్రామసమీపంలోని సుధాకర్ రెడ్డి కోళ్లఫారం వద్ద లారీ డ్రైవర్, క్లినర్‌ను బెదరించిన సంఘటనలో ఇద్దరు దొంగలను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను శనివారం సీఐ మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. కర్ణాటక హొసపేటలో ఓ ఫ్యాక్టరీ నుంచి లారీ స్లాగ్ లోడుతో జమ్మలమడుగులోని దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీకి గురువారం సాయంత్రం బయలుదేరారు. రాత్రి నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని సుధాకర్ రెడ్డి కోళ్లఫారం వద్ద బొలెరో వాహనం వెనుక నుంచి ఓవర్‌టేక్ చేసి లారీని అడ్డుకున్నారు. డ్రైవర్ లారీని ఐఓసీ డిపో వద్ద పక్కన ఆపారు. బొలెరో వాహనంలో నుంచి ముగ్గురు వ్యక్తులు డ్రైవర్ ఇసాక్, క్లీనర్ సునీల్‌తో వాదనకు దిగి వారిని కిందకు లాగి చితకబాదారు. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో రెండు సెల్‌ఫోన్లను లాక్కొని పరారయ్యారు. లారీ డ్రైవర్ ఇసాక్ శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ దారి దోపిడీ దొంగల కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు నలుగురు వ్యక్తులు ముగ్గులు వ్యక్తులు తెల్ల బొలెరో వాహనంలో గుత్తి నుంచి బళ్లారికి వెళ్తుండగా గొల్లలదొడ్డి క్రాస్ వద్దవారిని గుర్తించామన్నారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన చిన్న కందుకూరి ఆజేయ్, బెల్లంప్రశాంత్, గుత్తి మండలం లచ్చానుపల్లికి చెందిన వడుగూరు ఆదర్శలను అరెస్ట్ చేశామన్నారు. మరో వ్యక్తి జీవన్‌కుమార్ పరారీలో ఉన్నాడన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

వేరుశనగ పంపిణీని తనిఖీ చేసిన డీఏఓ


మల్లాపల్లి ఆర్బీకేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

గోరంట్ల, జూన్ 1: ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తున్న విత్తన పంపిణీని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు శనివారం తనిఖీ చేశారు. మండలం లోని మల్లాపల్లి ఆర్బీకేలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి, విత్తన నాణ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలానికి 4,289క్వింటాళ్లు రావలసిన ఉండగా, ఇప్పటి వరకు 3,679.8 క్వింటాళ్ల కె -6రకం సరఫరా అయినట్లు ఏఓ మునికృష్ణ తెలిపారు. మండలంలోని 17 ఆర్బీకేల ద్వారా 4,331మంది రైతులు పేర్లున మోదు చేసుకోగా 12,266 బస్తాలు సమకూర్చా మన్నారు. అయితే ఇప్పటివరకు 3,232మంది రైతులు 10,640 బస్తాల కాయలు తీసుకెళ్లార న్నారు. వారితోపాటు ఏఈఓ మల్లికార్జున, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జపానందస్వామికి రైతుల సన్మానం


స్వామిజీని సత్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, జూన్ 1: స్థానిక రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామిని శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో తాలూకాలోని రైతులు శనివారం ఘనంగా సన్మానించారు. గడిచిన మార్చ్ నెల నుంచి స్వామి పావగడ ప్రాంతానికి చెందిన రైతుల ఎన్నో వేల పశువులకు గడ్డి పంపిణీ చేసి, రక్షించారని సీనియర్ రైతు కెంచగానపల్లి గోవిందప్ప అన్నా. అలాగే స్వామి చళికెర, మొలకలమూరు, గుడిబండ తదితర ప్రాంతాలకు చెందిన ఎన్నో పశువులకు మేత అందంచారన్నారు. ఈ నేపథ్యంలో రైతులు స్వామిజీకి పాదపూజ చేసి సత్కరించారు. స్వామిజీ సేవలు ప్రజలకు మరింత ఉపయోగపడాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో లాయర్ భగవంతప్ప, తర్కారి కిష్టప్ప, గంగాధర్‌నాయుడు అనేక మంది రైతులు పాల్గొని స్వామిజిని సన్మానించారు.

రాగిమేకలపల్లి వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమణ


చదును చేసిన గ్రామ కంఠం స్థలం

గోరంట్ల, జూన్ 1: మండలంలోని పాలసముద్రం పంచాయతీ రాగిమేకలపల్లి వద్ద ఉన్న గ్రామ కఠం ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అడంగల్ ప్రకారం సర్వేనెంబర్ 21-1లోని 10.80 ఎకరాల్లో రాగిమేకలపల్లి గ్రామం, శ్మశానవాటిక పోను మిలిన రెండున్నర ఎకరాలు గ్రామ కఠం స్థలంలో గుట్ట ఉంది. పాలసముద్రం వద్ద పరిశ్రమల రాకతో ఈప్రాంతంలో భూముల ధరలు పెరిగాయి. దీంతో హిందూపురం ప్రధాన రహదారికి అనుబంధంగా ఉన్న గ్రామీణ రోడ్డు పక్కన ఉన్న స్థలం కావడంతో కొంతమంది కన్నుపడింది. ఆ స్థలానికి తమకు పట్టా ఇచ్చారంటూ ఇటీవల కాటేపల్లికి చెందిన ఇద్దరు గ్రామస్థాయి నాయకులు ఆ గ్రామ కంఠం స్థలాన్ని చదును చేసి, ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల విధుల్లో రెవెన్యూ అధికారులు బిజీగా ఉండడంతో ఇదే అదునుగా భావించి ఎక్స్ కవేటర్ తో గుట్టలోని రాళ్లను తొలగించి చదువును చేయడం ప్రారంభించారు. దీనిపై రాగిమేకల పల్లి గ్రామస్థులు శనివారం అభ్యంతరం వ్యక్తం చేయడంతో విషయం బయటపడింది. ప్రభుత్వ స్థలం ఆక్రమ ణ పట్ల తహసీల్దార్ అక్బల్ బాషాను వివరణ కోరగా... ఈ విషయం ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను నిలిపివేయాలని వీఆర్ఓను ఆదేశించామన్నారు. ఆక్రమణదారుల బారినుంచి ప్రభుత్వ స్థలాన్ని కాపాడడానికి చట్టపరమైన చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు.